క్లుప్తంగా

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దముడియం : సమాజంలోని ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగంలోని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు మెజిస్ట్రేట్ ఎస్.భార్గవి తెలిపారు. బుధవారం మండలంలోని మేడిదిన్నె గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ ఆర్థిక స్థోమత వల్ల కేసులకు లాయర్లను నియమించుకోలేని వారికి కోర్టునే లాయర్లను నియమిస్తుందన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిన్నలక్ష్మయ్య, ఎంపీడీవో వెంకటరమణయ్య, ఎస్ఐ రామకృష్ణ, న్యాయవాదులు సూర్య పెద్దిరాజు, జాకిర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచర్ల గ్రామంలో బుధవారం అక్రమ మద్యం బాటిళ్లను అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్దనుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. 9121100613 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి ఆహ్వానం

కమలాపురం : మండలంలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నచెప్పలి (ఓసీ–మహిళ), కమలాపురం–2(ఎస్సీ–జనరల్), పందిళ్లపల్లె(ఎస్సీ జనరల్) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె అందులో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

సచివాలయాల్లో జన్ భాగీధారి కార్యక్రమాలు

లింగాల : మండలంలోని అన్ని సచివాలయాల్లో జన్ భాగీదారి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీఓ సురేంద్ర నాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాలలో ప్లెక్సీల మీద అందరి సంతకాలు సేకరించి అంబేడ్కర్ ఫొటోలు, అందుకు సంబంధించిన ఫొటోలను కార్యక్రమాలను అప్‌లోడ్ చేయడం జరుగుతోంది. అలాగే ప్రతి సచివాలయ పరిధిలో 5 మంది ఉత్సాహవంతులైన ప్రజలను ఎంపిక చేస్తున్నారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే అంబేడ్కర్ ఈవెంట్‌కు వారిని పంపిస్తామన్నారు. 18వ తేదీన లింగాల నుంచి విజయవాడకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు.

దోబీఘాట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



దోబీఘాట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : స్థానిక వలసపల్లె రోడ్డులో ఈద్గా వద్ద ఉన్న దోబీఘాట్ వల్ల రజకులకు ఎంతో ఉపయోగం ఉంటుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన దోబీఘాట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రజకులు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరికల రెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీముల్లా, పార్టీ నాయకులు కల్లూరు ఓబుళరెడ్డి, అబ్దుల్ గఫూర్, రజకులు పాల్గొన్నారు.

రేపు గ్రామ సభలు

ఎర్రగుంట్ల : వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు రోడ్డు విస్తరణ కోసం సేకరణ చేయుచున్న భూముల విషయంపై ఎర్రగుంట్ల, హనుమనుగుత్తి, పోట్లదుర్తి, పెద్దనపాడు, కోడూరు గ్రామాలలో ఈనెల 12వ తేదీన జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన రైతులకు వారి గ్రామాల గ్రామ సచివాలయంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూముల విషయంపై నష్టపరిహారం నిర్ధారించుటకు గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు.

నివాళి

చెన్నూరు : చెన్నూరు పార్కు వీధికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మిశెట్టి రమేష్ మాతృమూర్తి తుమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తుమ్మిశెట్టి రమేష్ ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలలో ప్రతిభ చాటితేనే గుర్తింపు

వేముల : క్రీడాకారులు క్రీడలలో ప్రతిభను చాటితేనే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. బుధవారం వేములలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఆడుదాం.. ఆంధ్రా పోటీలలో భాగంగా మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. క్రీడలలో ప్రతిభ ఉన్నప్పటికి గ్రామీణ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు లేక పాల్గొనే అవకాశం లేకుండా పోయిందన్నారు. అలాంటి క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పోటీ పడేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మండలస్థాయిలో ఖోఖో, క్రికెట్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నారని.. ఆయా క్రీడలలో క్రీడాకారులు తమ ప్రతిభను చూపాలన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన క్రికెట్ జట్టుకు రూ.10వేలు బహుమతి, రన్నర్ జట్టుకు రూ.5వేల బహుమతి ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మాండి మా పీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం మండస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు క్రీడాస్ఫూర్తితో రాణించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన ముఖ్యమంత్రి గ్రామీణ ప్రాంత క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీయాలన్న ఉద్దేశ్యంతో ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం వారు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్ లక్ష్మీభార్గవి, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళిలు పాల్గొన్నారు.



వల్లూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



చెన్నూరులో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

ఆడుదాం.. ఆంధ్రా ఆటల పోటీలు ప్రారంభం

సింహాద్రిపురం : స్థానిక వైఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నుంచి ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఆటల పోటీలలో గెలుపొందిన జట్లు నియోజకవర్గస్థాయిలో ఆడాల్సి ఉంటుంది. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : విద్యతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని సచివాలయాల పరిధిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజ సంపతి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

లింగాల : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆట స్థలంలో బుధవారం సచివాలయాల పరిధిలో మండలస్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ రమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించి మాట్లాడారు. యువకులనుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనే విధంగా ఈ ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించడం హర్షణీయం అన్నారు. క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింట్, వాలీబాల్, ఖో–ఖో క్రీడలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రైజ్ మనీతో పాటు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో ప్రైజ్ మనీ ప్రకటించడంతో నియోజవకర్గ క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం నెలకొందన్నారు. కమలాపురం నియోజకవర్గ టీమ్ సభ్యులు రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, చెన్న కేశవరెడ్డి, నిఖిల్‌రెడ్డి, గండి భాస్కర్, ఎంపీడీఓ జ్యోతి, ఎంఈఓ బేబి, ఇతర అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలస్థాయి పోటీలను రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపురెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని వారు కోరారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి వీరపునాయునిపల్లె మండలాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. క్రికెట్ పోటీల్లో తంగెడుపల్లె, గంగిరెడ్డిపల్లె, ఎస్.పాలగిరి, అనిమెల, మొయిళ్లచెరువు, వీరపునాయునిపల్లె గ్రామాలకు చెందిన జట్లు పాల్గొనగా తంగెడుపల్లె, ఎస్. పాలగిరి, వీరపునాయునిపల్లె జట్లు విజయం సాధించాయి. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలుర విభాగంలో గంగిరెడ్డిపల్లె, ఎస్.పాలగిరి, ఉరుటూరు గ్రామాలకు చెందిన జట్లు పాల్గొనగా ఉరుటూరు జట్టు విజయం సాధించిందని ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని చెన్నూరు, కొండపేట, ఉప్పరపల్లెలలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ పోటీలను ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఎస్.భాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు. కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు ఖోఖో, వాలీబాల్ కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఉప్పరపల్లెలో పురుషులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. చెన్నూరు పార్కు నందు వాలీబాల్, బ్యాడ్మింటన్‌ను పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, కార్యదర్శులు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మండలంలో బుధవారం నిర్వహించిన పలు క్రీడలు ఉత్సాహంగా సాగాయి. ఏ ఓబాయపల్లెలోని క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వల్లూరు జట్టు మొదటి స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో తప్పెట్ల జట్టు మొదటి స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో లేబాక జట్టు మొదటి స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. మండల స్పెషలాఫీసర్ బ్రహ్మయ్య క్రీడా పోటీలను పరిశీలించారు. క్రీడా కారులను అభినందించారు. ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్డీ ప్రసాద్ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రత్నరాజు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జమ్మలమడుగు మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పెద్దపసుపుల జెడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులకు టీషర్టులు, క్యాప్‌లు అందజేసి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరమణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేములలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు



వేంపల్లెలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి



పులివెందులలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి



పెద్దముడియంలో పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి



కమలాపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉత్తమారెడ్డి



వీఎన్‌పల్లెలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీరప్రతాపురెడ్డి, రఘునాథరెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెండ్లిమర్రి : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3వేలు పెంచిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించి సామాజిక సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండలంలో నూతనంగా 127 పింఛన్లు మంజూరైయ్యాయన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3వేలు పెంచారన్నారు. గతంలో చంద్రబాబు హయంలో రూ.1000 పింఛన్ ఉంటే ఎన్నికల సమయంలో రూ.2వేలు చేశారన్నారు. వృద్ధాప్యంలో అవ్వ, తాతలు ఇబ్బందులు పడకూడదని దానిని జగన్ విడతల వారిగా రూ.3 వేలు పెంచారన్నారు. ఈ విషయాన్ని పింఛన్ దారులు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో నవరత్న పథకాల అమలుతో సువర్ణ పాలన సాగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కొసం వృద్ధులు, వికలాంగులు, గంటల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపు కాసేవారని గుర్తు చేశారు. ఇన్ని చేసిన జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పెండ్లిమర్రిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్, ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి తదితర వ్యాధులకు వైద్య చికిత్సలు అందించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రెండో విడత ‘జగనన్న ఆరోగ్య సురక్ష’



ఆరోగ్య సురక్ష కిట్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎర్రగుంట్లలో ఆరోగ్య సురక్ష-2ను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లచే రోగులకు దీర్ఘకాలిక వ్యాధులతోపాటు పలు జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ కిట్లను అందించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక సుందరయ్య కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ పరిశీలించి మాట్లాడారు. పట్టణ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, కడప పట్టణ ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యులు సుమతి, లక్ష్మీప్రియలు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ భాస్కర్ వైఎస్సార్‌సీపీ నాయకులు డెవిడ్, మున్సిపల్ అధికారులు సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తగిన ఆధారాలతో రావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జమ్మలమడుగు మండలం సుగమంచిపల్లె గ్రామానికి చెందిన సుమారు 15 సంవత్సరాల బాలుడు తప్పిపోయాడని, బాలుని ఆచూకీ కోసం తమను సంప్రదించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్ తెలిపారు. ఆయన వివరాల మేరకు జమ్మలమడుగు ప్రాంతంలో బాలుడు తిరుగుతున్నాడని పోలీసులు గుర్తించి కడపలోని బాలల సంక్షేమ సమితిలో హాజరు పరిచారన్నారు. బాలునికి మాట, వినికిడి లోపం ఉందని, కుటుంబ వివరాలు, చిరునామా చెప్పలేకపోతున్నాడన్నారు. బాలుడిని కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంచామన్నారు. బాలునికి సంబంధించిన తల్లిదండ్రులు, ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా తగిన ఆధారాలతో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 7680820205 లేదా 9948779114 నెంబరులో సంప్రదించాలన్నారు.

నేతన్నల కష్టాన్ని గౌరవించాలి

కడప కల్చరల్ : మన ప్రాంత వాతావరణానికి తగినట్లుగా వస్త్రాలను తయారు చేసి ఇస్తున్న నేతన్నల కష్టాన్ని గుర్తించి గౌరవించాలని నాబార్డు సంస్థ ప్రతినిధులు కోరారు. సంస్థ పక్షాన స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో దాస్ ఎడ్యుకేషనల్ అండ్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేతలు, కళాకృతులు రూపొందించే సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ స్టాల్స్‌ను తిలకించేందుకు, ఈ దుస్తుల తయారీ వెనుక నేతన్నల కష్టాన్ని వివరించేందుకు విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

ఆర్ఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్ : ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడిగా వెనుతుర్ల రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యాడు. కడప నగరంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఆర్ఎస్‌యూ 9వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 12 మందితో రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా రవిశంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగరాజు, రాష్ట్ర కోశాధికారి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, మునిరెడ్డి, అవినాష్, చరణ్, మణికంఠ, చెన్నకేశవ రెడ్డి, బిమేష్ తదితరులను ఎన్నుకున్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు ‘బి’ సర్టిఫికెట్ ప్రదానం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా చేతుల మీదుగా ఎన్‌సీసీ ‘బి’ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే ఎన్‌సీసీ ‘సి’ సర్టిఫికెట్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం తిరుపతి 5 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన సుబేదార్ కై లాస్‌కుమార్, హవల్దార్ యు.వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో కేడెట్స్‌కు డ్రిల్‌పై పరేడ్ నిర్వహించారు. అనంతరం 42 మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ డి. విన్నీతేజ, కేడెట్స్ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరిగుట్టలో పూర్వం నుంచి ఉన్న పీర్లచావిడి, శ్రీఆంజనేయ స్వామి దేవస్థానాలు ఉన్నాయి. పీర్ల చావిడిని పాడా నిధులతోనూ, దేవాదాయ ధర్మదాయ శాఖ ద్వారా శ్రీఆంజనేయస్వామి దేవస్థానాలను వైఎస్ కుటుంబ సభ్యుల సహకారంతో సర్వాంగ సుందరంగా పునః నిర్మించారు. మూడు రోజుల నుంచి శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరిగాయి. చివరి రోజైన బుధవారం ఆంజనేయ స్వామి వారి యంత్ర ప్రతిష్ట, బింబ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, శిఖల కలశ, గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, లక్ష్మీప్రసన్న దేవిలు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.



ఆలయంలో స్వామివారి మూలవిరాట్

భోజనం, క్రికెట్ కిట్లు ఇస్తామని..

పులివెందుల రూరల్ : పులివెందులలో టీడీపీ నాయకులు క్రికెట్ ఆడుకుంటున్న కొందరు యువకులను తీసుకెళ్లి వారికి టీడీపీ కండువాలు వేసి భారీగా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరారంటూ తమ ఎల్లో మీడియాలో ప్రచురించుకుంటూ మరింత దిగజారుతున్నారని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ బీటెక్ రవి మంగళవారం పులివెందులలోని క్రీడా మైదానాలలో క్రికెట్ ఆడుతున్న నగరిగుట్టకు చెందిన కొంత మంది మైనర్ పిల్లలకు భోజనం పెట్టి క్రికెట్ కిట్లు ఇప్పిస్తామంటూ వారిని తీసుకెళ్లి టీడీపీ కండువాలు వేసి పార్టీలో చేర్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే కొన్నిచోట్ల టీడీపీలో ఉన్నవారికే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. పులివెందులలో ప్రజలందరూ వై ఎస్ కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటారన్నారు.

మా పిల్లలకు ఆశ చూపి కండువాలు వేశారు..



హాజీ బాషా తల్లిదండ్రులు బషీర్, ఫక్రుబీ

మా పిల్లలకు ఆశ చూపి వారిని తీసుకెళ్లి టీడీపీ కండువాలు వేశారని ఓయువకుడు హాజీ బాషా తల్లిదండ్రులు బషీర్, ఫక్రుబీలు తెలిపారు. మేము ఎన్నో సంవత్సరాలుగా వైఎస్ఆర్ కుటుంబంతోనే ఉన్నామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జమ్మలమడుగు : 1992–95 డిగ్రీ బీఏ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పట్టణంలోని నాగులకట్టలో ఉన్న చౌడేశ్వరిదేవి కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటి డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ బాలచంద్రారెడ్డిని ఘనంగా వారు సన్మానించారు.



పూర్వ విద్యార్థులతో అప్పటి ప్రిన్సిపాల్ బాలచంద్రారెడ్డి